క్లుప్తంగా

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో ప్రణీత అన్నారు. పట్టణంలోని తాటిగూడ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. కష్టపడి చదివి టెన్త్‌లో మంచి గ్రేడ్ సాధించాలని సూచించారు. అదేవిధంగా ఇటీవల ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు రాజేష్, ప్రశాంత్‌ను అభినందించారు. ప్రిన్సిపాల్ నారాయణ, ఉపాధ్యాయులు సంజయ్, రవికాంత్, జ్యోత్ కుమార్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌ను కలిసిన నాయకులు



సన్మానిస్తున్న జిల్లా నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను జిల్లా నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డిలు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ సమీకరణలు, ఇతర అంశాలపై ఆయనతో చర్చించారు. కిసాన్ సెల్ బేల మండల అధ్యక్షుడు గస్ శ్యామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు విపిన్, బొక్రే శంకర్, టక్రే సాగర్ తదితరులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగాల దరఖాస్తు వయోపరిమితి పెంపు నిరుద్యోగ యువతకు వరంలాంటిదని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వం వయోపరిమితిని 44 నుంచి 46 ఏళ్ల వరకు పొడగింపుపై హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సేవభవన్ ఎదుట మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు వెంకట్‌రెడ్డి, నగేశ్, సంతోష్, భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి



స్టాక్ రికార్డులు పరిశీలిస్తున్న పుల్లయ్య

బజార్‌హత్నూర్: రైతులు నాణ్యమైన విత్తనాలు, మందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంతోపాటు గిర్నూర్ గ్రామాల పరిధిలో మొక్కజొన్న పంటలను మంగళవారం పరిశీలించారు. గిర్నూర్‌లోని ప్రైవేటు మందుల షాపు తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లోని రసాయనిక ఎరువులు, స్టాక్ రికార్డులు పరిశీలించారు. ప్యాక్స్ చైర్మన్ వెంకన్నయాదవ్, ఏవో ప్రమోద్‌రెడ్డి, ఏఈవోలు రాజేశ్వర్, కృష్ణపాల్, సంతోష్, సంజీవ్, రాము పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: కుష్ఠుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా లెప్రసీ అధికారి గజానన్ అన్నారు. మండలంలోని బంగారుగూడలో గల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం కుష్ఠుపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో విటమిన్ ఏ కార్యక్రమాన్ని వైద్యాధికారి సర్ఫరాజ్ ప్రారంభించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సిడాం వామన్‌రావ్, మండల వైద్యాధికారి డాక్టర్ సర్ఫరాజ్, స్కూల్ ప్రిన్సిపాల్ తన్వీర్, ఎల్టీ రమణ చారి, సూపర్‌వైజర్ సుభాష్ ఉన్నారు.

ఎస్సైగా శ్రీకాంత్

నేరడిగొండ: నేరడిగొండ ఎస్సైగా శ్రీకాంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సాయన్న ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. సిరికొండ నుంచి శ్రీకాంత్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. . కాగా, పోలీసు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

తెగులు.. దిగుబడి దిగులు

- శనగ పంటకు అనుకూలించని వాతావరణం
- చేలలో ఎండుతున్న పంట
- ఆందోళనలో అన్నదాతలు



తెగులు, పురుగు ఉధృతితో ఎండుతున్న శనగ పంట

తాంసి: వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి పంట సరైన దిగుబడి లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి పంటలోని నష్టాన్ని పూడ్చుకునేందుకు ఎన్నో ఆశలతో తాంసి, భీంపూర్ మండలాల్లోని రైతులు యాసంగిలో శనగ పంటను అధికంగా సాగు చేశారు. ప్రారంభంలో వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ పంట ఎదిగే సమయంలో వాతావరణంలో మార్పులతో తెగులు సోకింది. పూత, కాత సమయంలో ఒక్కసారిగా పంట ఎండుపోవడం జరిగింది. గత మూడు నెలలుగా పురుగుమందుల పిచికారీతో పాటు నీటితడులు అందించిన పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం పంటను ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొగమంచుతో ప్రభావంతో..

తాంసి, భీంపూర్ మండలాల్లో రబీలో దాదాపుగా 5500 వేల ఎకరాల్లో రైతులు శనగ సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత నెల రోజుల క్రితం కురిసిన పొగమంచు కారణంగా పూత, కాత దశలో ఉన్న పంట పూర్తిగా దెబ్బతింది. పురుగు ఉధృతి సైతం పెరిగింది. అలాగే గత నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృత్తమై ఉండడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పంటకు లద్దె పురుగు, పచ్చ పురుగు, ఎండుతెగులు సోకింది. దీంతో పంట ఎండు ముఖం పడుతోంది.

తగ్గనున్న దిగుబడి..

శనగ పంటకు తెగుళ్ల సోకడంతో ఈ ఏడాది భారీగా దిగుబడి తగ్గనుంది. గత ఏడాది ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఎకరానికి 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితి కనిపిస్తోంది. పంట పెట్టుబడి పెరిగిన క్రమంలో దిగుబడి సైతం పెరగాల్సి ఉంది. కానీ వాతావరణ మార్పులతో దిగుబడి తగ్గుతుంది. పంట సరిగా ఎదగక పోవడం, ఎండు బారడంతో దిగుబడిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు శనగపంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను ముందస్తుగా రైతులకు వివరిస్తే మేలు జరిగే అవకాశం ఉంది.

తెగులు ఉధృతి తగ్గడం లేదు



ప్రస్తుతం శనగ పంటకు లద్దెపురుగు, పచ్చపురుగుతో పాటు తెగులు సైతం ఆశించి పూర్తిగా దెబ్బతింటుంది. మందులు పిచికారీ చేసినా వైరస్ ఉధృతి తగ్గడం లేదు. వాతావరణం అనుకూలించకపోతే పంట పూర్తిగా దెబ్బతింటుంది.

– ప్రకాష్, రైతు, తాంసి

దిగుబడి తగ్గేలా ఉంది



వాతావరణంలో మార్పుల కారణంగా శనగపంట చాలా వరకు దెబ్బతింది. పంట దెబ్బతినడంతో దిగుబడి పూర్తిగా తగ్గుతుంది. గతేడాది ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 4 క్వింటాళ్ల మాత్రమే వచ్చేలా ఉంది.

– లక్ష్మీపతి, రైతు, పొన్నారి

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



ప్రశంసపత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఈవో ప్రణీత, డీడీ దిలీప్‌కుమార్ తదితరులు

- డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో టి.ప్రణీత, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ బాలుర పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. పెయింటింగ్, పద్యాలు, పాటలు, ఉపన్యాస తదితర అంశాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లాలోని 56 పాఠశాలలకు చెందిన 138 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. నిత్య జీవితంలో సైన్స్‌కు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

విజేతలు వీరే..

పెయింటింగ్‌లో: ఎస్.పల్లవి (ప్రథమ, ఆదిలాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తిర్పెల్లి), ఎ.తరుణి (ద్వితీయ,గెజిటెడ్ నంబర్–2 ప్రభుత్వ పాఠశాల), ఎ.చందు(తృతీయ, లక్సెటిపేట్ ప్రభుత్వ పాఠశాల)

పద్య విభాగంలో..: ఆర్.సందీప్ (ప్రథమ, టీడబ్ల్యూయూఆర్‌జేసీ ఆదిలాబాద్), సమైరా ఫాతిమా (ద్వితీయ, సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ స్కూల్, ఆదిలాబాద్), ఎం.వైష్ణవి (తృతీయ, జెడ్పీఎస్ఎస్ మన్నూర్).

పాటల విభాగంలో : పి.ప్రవళిక (ప్రథమ, జైనథ్ జెడ్పీఎస్ఎస్), సీహెచ్ కావేరి (ద్వితీయ, ఇంద్రవెల్లి ఏహెచ్ఎస్ పాఠశాల), బి.మల్లేశ్ (తృతీయ, జెడ్పీహెచ్ఎస్ఎస్ ధనూర్ (బి))

ఉపన్యాస విభాగంలో..: రశికేతన్ (ప్రథమ, లిటిల్ స్టార్ హైస్కూల్ విద్యార్థి, ఆదిలాబాద్), జే శ్రీకాంత్ (ద్వితీయ, టీడబ్ల్యూయూఆర్‌జేసీ ఆదిలాబాద్), హరిప్రియ (తృతీయ, జెడ్పీఎస్ఎస్ జైనథ్).

అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెమోంటోలు, చెక్‌ముఖి సంచికలతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీ నర్సిములు, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అకడమిక్ కోఆర్డినేటర్ భాస్కర్, ఏటీడీవో నిహారిక, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని గోండ్‌గూడ, వడ్డెర గల్లీ, భీంనగర్, ప్రబుద్ధనగర్, సట్వాజీగూడ, మర్కగూడ, బుర్సన్‌పటార్, పిప్రి గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్లు, మురుగుకాల్వల పనులను ప్రారంభించి మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే పల్లెలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయన్నారు. దీర్ఘకాలిక సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ జహిర్, నాయకులు మీర్జా యాకుబ్ బేగ్, సోమోరే నాగోరావ్ జితేందర్, జునైద్, కొడప భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.



బుర్సన్‌పటార్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పాత ఉట్నూర్, ఎత్మసూరునగర్, కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'రైతు రుణమాఫీ ఏమైంది?'

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పదవీ కాలం ముగిసిన సర్పంచులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బూటకపు హామీలు ఇచ్చి రైతులను మోసం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తమపై విమర్శలు మాని ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనోహర్, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, రాజు, గంభీర్, సాజిద్ పాల్గొన్నారు.

పరామర్శ

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సాయికుమార్, మడావి వైశాలి ఇటీవల మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీమంత్రి జోగు రామన్న పరామర్శించారు. అక్కడి నుంచి జైనథ్‌కు వెళ్లి మృతుడు రాంచందర్ కుటుంబీకులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సర్పన్ లింగారెడ్డి, అడప తిరుపతి, దాసరి రాములు ఉన్నారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

ఇచ్చోడ/గుడిహత్నూర్: వన్యప్రాణులను వేటాడితే చర్యలు తీసుకుంటామని ఇచ్చోడ అటవీశాఖ అధికారి పుండలిక్ హెచ్చరించారు. చిరుత దాడిలో మృతిచెందిన ఎద్దు, లేగదూడలకు ప్రభుత్వ తరపున చెక్కులు మంజూరు చేయగా మంగళవారం ఇచ్చోడ అటవీశాఖ కార్యాలయంలో బాధిత రైతులకు అందజేశారు. గుడిహత్నూర్ మండలంలోని దామన్‌గూడకు చెందిన కృష్ణకు రూ.23 వేలు, మూత్నూర్‌కు చెందిన కేశవ్‌కు రూ.12 వేల నష్ట పరిహారం అందించారు. ఈ సందర్భంగా పుండలిక్ మాట్లాడుతూ వన్యప్రాణులకు వేటాడం చట్టారీత్యా నేరమని, విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆధికారి శీలనంద్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీని కలిసిన మహిళా కమిషన్ సభ్యురాలు

ఆదిలాబాద్‌టౌన్: ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు చేపట్టిన ఎం.సబితను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరీబాయి కలిశారు. మంగళవారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా మహిళ, శిశు సంక్షేమ శాఖ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ యశోద తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు పీడీని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నగేశ్, కార్యదర్శి నానయ్య, పట్టణ అధ్యక్షుడు సంతోష్, మహేందర్, రాకేశ్, సయ్యద్ హంజా తదితరులు పాల్గొన్నారు.



పీడీకి పూలమొక్కను అందజేస్తున్న ఈశ్వరిబాయి

కైలాస్‌నగర్: రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరీబాయి మంగళవారం ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయ చాంబర్‌లో కలిసిన ఆమె శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'

జైనథ్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.25 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. అంతకుముందు అతి ప్రాచీన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఖాప్రిలో రూ.10 లక్షలు, కరంజిలో రూ.8లక్షలతో నిర్మించనున్న అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆశమ్మ, ఎంపీటీసీ సుదర్శన్ పాల్గొన్నారు.



జైనథ్‌లో భూమిపూజ చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి

నేరడిగొండ: ప్రభుత్వ నిధులతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్‌చందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ లేదంటూ విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే అయినంత మాత్రాన నువ్వు అభివృద్ధి చేసిందేమి ఉండదని తెలిపారు. గతంలో కాంగ్రెస్‌లో ఇన్‌చార్జీగా వ్యవహరించిన తీరు మరిచిపోయినట్లు ఉన్నారని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు వసంత్‌రావు, మండల మైనార్టీ అధ్యక్షుడు వకీల్, నాయకులు ఆడె జనార్దన్, పాల శంకర్, నాయిడి రవి, మురళీగౌడ్, బొలిశెట్టి రాములు, కుంట శంకర్, ఆసిఫ్, చౌహాన్ రవి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టీయూటీఎఫ్ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి

తలమడుగు: టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ముసుకు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్ మంగళవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రాథోడ్ బలిరాం, శ్రీకాంత్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తాంసి: అర్లి(టి) గ్రామానికి చెందిన గోల్లి వైభవ్ యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కంపెనీ తరపున ఇన్సురెన్స్ చేశారు. ఇందుకు సంబంధించి మంజూరైన రూ.లక్ష చెక్కును మేనేజర్ శ్రీకాంత్ మంగళవారం మృతుడి తండ్రికి అందజేశారు. సభ్యులు శంకర్, నవీన్, రైతులు ఉన్నారు.

16న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 16న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షకు 20 మార్కులు, వార్షిక పరీక్షకు 80 మార్కులు ఉంటాయని పేర్కొన్నారు. 17న మానవత విలువల పరీక్ష, 19న పర్యావరణ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఫెయిల్ అయినవారు కళాశాలలో పరీక్షకు హాజరుకావాలని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జైనథ్: సాంగ్వి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. సర్పంచ్ విఠల్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ రెడ్డి, నాయకులు రమేశ్ రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: చట్టాలపై అవగాహన ఉండాలని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్టు కృష్ణవేణి పేర్కొన్నారు. మండలంలోని అంకోలి గల అంగన్‌వాడీ కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై అవగాహన కల్పించారు. శ్యామల, వేణుతాయి, కవిత, సునీత పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 14న ఉదయం 10 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శైలజ ప్రకటనలో తెలిపారు. చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అలాగే, మున్సిపల్ కార్యాలయ పరిపాలన వ్యవహారాలను బుధవారం నుంచి కొత్త భవనంలోకి మార్చనున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీలో వార్షికోత్సవం

నార్నూర్: గాదిగూడ కేజీబీవీలో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు పలువురిని అలరించాయి. వైస్ ఎంపీపీ యోగేష్, ప్రత్యేక అధికారి ప్రియాంక ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

నేరడిగొండ: పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని లఖంపూర్(జి) గ్రామంలో మంగళవారం ఐదేళ్ల పిల్లలందరికీ బరువు, ఎత్తు కొలతలు చేశారు.

నల్గొండ సభలో బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: నల్గొండలో మంగళవారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బేల: సదల్‌పూర్, చప్రాల గ్రామంలో జాతీయ ఉపాధి హామీ కింద రూ.19 లక్షల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. ముందుగా శ్రీ భైరందేవ్, మహాదేవ్ ఆలయంలో పూజలు చేశారు. బేల మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ వాంఖడే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండా వార్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చంద్రకాంత్ మడావి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

నేరడిగొండ: కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలని ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థి కోవ దౌలత్ రావు మొకాశి అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, యువ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డిని మంగళవారం మండల కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. శేఖర్, కరుణాకర్, మహేందర్, శేఖర్, దౌలాత్ రావ్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' వివరాలు సేకరణ

నేరడిగొండ: గృహజ్యోతిలో భాగంగా అధికారులు వడూర్ గ్రామంలో వినియోగదారుల వివరాలను సేకరించారు. ఆధార్, రేషన్ కార్డులతో పాటు ఫోన్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్ర, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

బోథ్: జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని బోథ్ బార్ అసోసియేషన్ కార్యదర్శి శంకర్ మంగళవారం లా సెక్రటరీ తిరుపతిని హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. పార్టీ(బి) మాజీ సర్పంచ్ జగ్నక్ మారుతి ఉన్నారు.

సన్మానం

బోథ్: పదవీ కాలం పూర్తి చేసుకున్న బోథ్ మాజీ సర్పంచ్ మాజీ వార్డు సభ్యులను ఎంపీపీ శ్రీనివాస్ మంగళవారం సన్మానించారు. మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాత్కాలికంగా ఇన్‌చార్జిగా మార్కెట్ కమిటీ డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజును నియమించారు.

'ప్రొటోకాల్ లేని వ్యక్తికి అధికారిక కార్యక్రమాలా?'

తలమడుగు: ప్రొటోకాల్ లేని వ్యక్తి ఒక పార్టీకి చెందిన వ్యక్తి అధికారిక కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ ప్రశ్నించారు. మండలంలోని సుంకిడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజకు ఆడే గజేందర్ ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజాస్వామ్యానికి అప్రతిష్ఠ అని అన్నారు. ఝరి సొసైటీ చైర్మన్ వెల్మ శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకుడు అభిరాం రెడ్డి ఉండం మాజీ సర్పంచ్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ విరుద్ధం'

బజార్‌హత్నూర్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కాకుండా ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ నేత ఆడే గజేందర్‌తో అధికార కార్యక్రమాలు, అభివృద్ధి పనులు ప్రారంభించడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ నాయకుడు చిల్కూరి భూమన్న తెలిపారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి పనులు మానుకోవాలని సూచించారు. చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్, సాయన్న, కవిందర్, మారుతి, జగదీశ్, విలాస్, సాయిచైతన్య, ఉపేందర్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

బేల: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో బుధవారం రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టనున్నారు. మంగళవారం సాయంత్రం కలశ, నూతన విగ్రహాలతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం 11.30 గంటల కు విగ్రహాల ప్రతిష్ఠాపన, తర్వాత మహా ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పీవోపీ పరిశ్రమను నిలిపివేయాలి

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని పిట్టలవాడలో గల పీవోపీ పరిశ్రమను వెంటనే నిలిపివేసి సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. సీపీఎం, బీఆర్ఎస్, సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా నాయకులు, వార్డు ప్రజలతో కలిసి మంగళవారం పరిశ్రమను సందర్శించారు. మల్లేశ్ మాట్లాడుతూ బండలను పిండిగా చేసేక్రమంలో దుమ్ముతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. జనావాసాల మధ్య ఉన్న పరిశ్రమను నిలుపుదల చేయాలని కలెక్టర్‌ను కోరారు. బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్, సీపీఎం నాయకులు దత్తాత్రి పాల్గొన్నారు.

'బీజేపీవి ప్రజావ్యతిరేక విధానాలు'

ఎదులాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులు, రైతుల హక్కులను హరించే విధంగా కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

'కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి'

ఎదులాపురం: దేశంలో ఉన్న 55 కోట్ల కార్మికులంతా కలిసి తమ ఓటు ద్వారా కార్మిక వ్యతిరేక బీజేపీ ప్రభుత్వానికి తగిన బబుద్ధిచెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మంగళవారం కార్మిక సంఘాల నాయకులతో కలిసి దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేవేందర్, వెంకట్ నారాయణ, నవీన్, స్వామి, జగన్, వీరేందర్, మారుతి, నితిన్ పాల్గొన్నారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

ఇచ్చోడ: ఎంపీడీవోగా లక్ష్మణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాంప్రసాద్ నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. నిజామాబాద్ జిల్లా నుంచి లక్ష్మణ్ ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈయనకు ముఖరా(బి) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మండల సర్పంచులు సంఘం మాజీ అధ్యక్షుడు పాండురంగ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహిముద్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గుడిహత్నూర్: ఎంపీడీవోగా మహమ్మద్ అబ్దుల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

నేరడిగొండ: ఎంపీడీఓగా రాజ్‌వీర్ బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ నుంచి రాజ్‌వీర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఆదిలాబాద్‌రూరల్: ఎంపీడీవోగా నాగేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మీకాంత్‌రావు నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

తాంసి: ఎంపీడీవోగా జి.మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన నిర్మల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

బజార్‌హత్నూర్: ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రాథోడ్ రాధ మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు.

సిరికొండ: ఎంపీడీవోగా బాలగంగాధర్ తిలక్ బాధ్యతలు స్వీకరించారు.